# పురుషోత్తము చౌధరి క్లుప్త జీవిత చరిత్ర (1803 - 1890)

పురుషోత్తము చౌధరి మహాకవి, సంకీర్తనాకారుడు, వాగ్గేయకారుడు, అభిషిక్తుడు. తన పూర్వికులు వంగ దేశానికి (బెంగాల్) చెందినవారు. బెంగాలి బ్రాహ్మణులు. కొన్ని రాజకీయ, సాంఘిక కారణాల వల్ల మొగలాయిల కాలంలో బెంగాల్ నుండి ఒరిస్సా రాష్ట్రానికి వచ్చి పర్లాకిమిడి అని స్థలంలో తమ నివాసాలను ఏర్పాటు చేసికొన్నారు. పర్లాకిమిడిని గంగ వంశీయులు పాలిస్తూ వుండేవారు. పురుషోత్తము చౌధరి పూర్వికులు మిరాసిదారులుగా అనగా శిస్తులు వసూలు చేసేవారుగా నియమింపబడ్డారు. శిస్తులు వసూలు చేయటంలో నాలుగు పరగాణాలపై పురుషోత్తము చౌధరి పూర్వికులు అధికారులుగా వుండేవారు. 'చౌ' అనగా నాలుగు అని అర్థం వుంది. అందుకని చౌధరి అనే బిరుదు వీరికి యివ్వబడింది. బ్రాహ్మణులుగా చతుర్వేద పరాయణులుగా వుండి వుండవచ్చును. అందువలన కూడా వీరికి చౌధరి అనే బిరుదు యివ్వబడింది.

పురుషోత్తము చౌధరి 1803లో కూర్మనాధ చౌధరి, సుభద్రాదేవి చౌధరికి జన్మించాడు. హైందవుడుగా, మరి ముఖ్యంగా బ్రాహ్మణుడుగా పుట్టాడు కనుక పుంసవనం, జాతకర్మ, నామకరణం, వటునిష్క్రమణం, అన్నప్రాసం, చూడాకర్మ, ఉపనయనం, వేదారంభం మొదలగు హైందవ సకల అచారాలు ఈయన జీవితంలో జరిగించబడ్డాయి.

పుట్టుకతోనే ఒక బ్రాహ్మణుడుగా హైందవ సంప్రదాయాలు, హైందవ మత భావాలు చౌధరికి అబ్బాయి. పాండిత్యంలో, కవిత్వంలో దినదినాభివృద్ధి చెంది పర్లాకిమిడి సంస్థానంలో ఆస్థాన కవిగా పేరుగాంచాడు. పురుషోత్తముడు విష్ణు భక్తుడు, నిష్ఠగల భక్తి తాత్పర్యాలు గల భక్తుడుగా జీవించాడు. అయితే ఆత్మ శాంతి లేదు. భక్తి, జ్ఞాన, కర్మ, వైరాగ్య, రాజయోగం మొదలగు మత విధానలన్నిటిలో జీవిత యాత్రను కొనసాగించాడు. బ్రహ్మలో లీనం కావాలన్నది ఈయన జీవిత లక్ష్యం. దీనిని సాధించలేక పోయాడు కనుక ఆత్మ శాంతి లేకుండా పోయింది.

ఆ సమయంలో ఒక క్రైస్తవ కరపత్రం దొరికింది. కొన్న సంవత్సరాల తదుపరి దానిని చదువుకొన్నాడు. దాని ఫలితంగా మనస్సులో నెమ్మది, హృదయంలో మార్పు వచ్చింది. కాలినడకతో విశాఖపట్టణము వచ్చి క్రీస్తును గురించి తెలిసికోవాలని ప్రయత్నించాడు. శ్రీమతి నాట్ ద్వారా ఆయన క్రీస్తును గురించి తెలిసికొన్నాడు. 1833 జూన్ 10న బాప్తిస్మం పుచ్చుకొన్నాడు. కొంత కాలానికి తన సతీమణి కూడా 1836లో బాప్తిస్మం పుచ్చుకొనినది.

పురుషోత్తము చౌధరి అనేక స్థలాలలో సువార్త సేవను జరిగించాడు. గతంలో రామశతకం, కృష్ణలీలలుపై శివపరంగా రచనలు చేశాడు. యేసు క్రీస్తును ఎరిగిన తర్వాత క్రైస్తవ రచనలు, ముఖ్యంగా సంకీర్తనలు వ్రాసికొని పాడుకొన్నాడు. గత 200 సంవత్సరాలగా సకల తెలుగు క్రైస్తవులందరు పాడుకొంటున్నారు. ఆయన సాహిత్యం బహు సంప్రదాయ బద్ధమైనది (Classical) పద ప్రయోగంలో భావ వ్యక్తీకరణలో త్యాగయ్య, అన్నమయ మొదలగు వారికి ఏ మాత్రం తక్కువైన వాడుకాదు. ఆయన రచనలు ఈ క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

1866 లో డాసన్, చౌధరి గార్ల కీర్తనలు ఒక గ్రంథ రూపంలో ప్రచురించబడినాయి.

1893 లో ఆంధ్ర క్రైస్తవ కీర్తనల గ్రంథం ప్రచురించబడినది. ఈ నాటికి ఈ గ్రంథం ఆయా సమయాలలో కొన్ని నూతన కీర్తనలు చేర్చబడి సంఘాల ద్వారా వాడబడుతూ ఉంది.

గత 200 సం॥లుగా ప్రపంచంలో ఉన్న తెలుగు క్రైస్తవులందరు పురుషోత్తమ చౌధరి కీర్తనలు పాడుకొంటు ఉన్నారు. ఈ కీర్తనలు పాడుకొని యెంతరో మారుమనస్సు పొందారు; విశ్వాసంలో పడిపోయి తిరిగి ఉజ్జీవింపబడిన వారున్నారు; ఆధ్యాత్మికంగా బలపర్చబడిన వారున్నారు.

పురుషోత్తమచౌధరి సాహిత్యముపై కొందరు పరిశోధనలు చేశారు. కీ॥ శే॥ డా॥ ఆర్. ఆర్. సుందర రావు పురాతన ఆధునిక కవుల జీవితాలను గురించి వారి సాహిత్యాన్ని గురించి "తెలుగులో క్రైస్తవ సాహిత్యం" అనే గ్రంథాన్ని ప్రచురించారు. అందు పురుషోత్తమ చౌధరి జీవితాన్ని, సాహిత్యాన్ని పరిచయం చేశాడు. ఆ తరువాత రెవ. డా॥ రావెల జోసఫ్ పురుషోత్తమ చౌధరి సాహిత్యములోని వేదాంత భావాలను ఇంగ్లీషు భాషలో ఒక గ్రంథం గా రచించగా చెన్నై క్రిస్టియన్ లిటరేచర్ సొసైటి వారు ప్రచురించారు. రెవ. బి.డి.పి. రావు క్రైస్తవ భక్తి కీర్తనల సేకరణ పరిశోధన జరిగిస్తున్నాడు. పురుషోత్తమ చౌధరి రచించిన 180 కీర్తనలను ఈయన సేకరించి పదిల పర్చాడు. 1997 లో శ్రీమతి సుధారత్నాంజలి పురుషోత్తమ చౌధరి సాహిత్యముపై పరిశోధన చేసింది. దానిని చెన్నై క్రిస్టియన్ లిటరేచర్ సొసైటి వారు ప్రచురించారు.

# పురుషోత్తము చౌధరి రచించిన గ్రంథాలు.

1. బైబులు నిఘంటువు. 3 భాగాలు(అలభ్యం)
2. దైవిక శాంతి మార్గము (అలభ్యం)
3. ఒరియా భాషలో ప్రసంగ మాలిక - 1877 (అలభ్యం)
4. తీర్పు దినముపై ప్రసంగం - (అలభ్యం)

కరపత్రాలు :

1. కులాచార పత్రిక - 1833
2. ముక్తి మార్గ ప్రదర్శనం - 1833
3. జగన్నాథ పరీక్ష - 1833 (అలభ్యం)
4. బ్రహ్మజ్ఞానం - 1853 (అలభ్యం)
5. అంధకార నాశనం - 1861
6. మశూచి, విశూచి సంకట భ్రాంతి నివృత్తి - 1863 (అలభ్యం)
7. మనసే మూలం - 1863 (అలభ్యం)

పద్యకావ్యాలు :

1. యేసు నాయక శతకం - 1845
2. యేసు క్రీస్తు ప్రభు శతకం - 1845
3. రక్షణ చరిత్ర - 1846
4. నిస్తార రత్నాకరం - 1846
5. పంచ చామర పన్నములు - 1847
6. క్రైస్తవ నీతి ప్రకాశం - 1851
7. సత్యవేదసార సంగ్రహం - 1871
8. సత్యభజన - 1874
9. విగ్రహ నిర్మాణం 1847 (అలభ్యం)
10. పంచరత్నములు - 1847
11. దేవుని విరూద్రూప వర్ణనం 1884 (అలభ్యం)
12. తెలుగు ప్రసంగాలు (అలభ్యం)
13. సంకీర్తనలు - 180

రెవ. డా॥ రావెల జోసెఫ్